ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో కొనసాగుతున్న సేవలు


కప్పరాడ ఆరోగ్య కేంద్రంలో కేస్ షీట్ అందిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, డిప్యూటీ మేయర్ సతీష్


వాసుదేవనగర్‌లో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

తాటిచెట్లపాలెం: రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి పరిపాలిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. 45వ వార్డు 255 సచివాలయం పరిధి కాలనీల వాసులకు శనివారం తాటిచెట్లపాలెం దరి వాసుదేవనగర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకుతో కలిసి ఆయన శిబిరాన్ని సందర్శించి వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష పేరిట ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రదర్శించిన ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూశారు. వివిధ సమస్యలతో వచ్చిన రోగులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, సచివాలయ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆర్పీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

708 మందికి వైద్య సేవలు

కంచరపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదల వైద్యానికి భరోసాగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 47వ వార్డు కంచరపాలెం పరిధి కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో కొనసాగుతున్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి వైద్య పరీక్షలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మందులు, కేస్ షీట్లు అందజేశారు. ప్రజలందరూ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఉచిత సేవలు పొందాలని కె.కె.రాజు కోరారు. సుమారు 708 మంది రోగులకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సనపల రాజేంద్ర తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, కార్పొరేటర్ కె.కామేశ్వరి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, డాక్టర్ శాంతి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

47వ వార్డులో కె.కె.రాజు పర్యటన


రాంజీ ఎస్టేట్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి రాంజీ ఎస్టేట్, పెదకొత్తూరు, అరుంధతి నగర్ ప్రాంతాల్లో శనివారం అధికారులతో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పర్యటించారు. నాడు–నేడు ద్వారా అభివృద్ధి చేసిన రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. మౌలిక వసతుల గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులో ప్రజల చిరకాల వాంఛ కప్పరాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ) నిర్మాణ పనులు పూర్తి కావడంతో త్వరలో ప్రారంభించేందుకు కృషి చేస్తామని కె.కె.రాజు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కె.కామేశ్వరి, ఇంజినీరింగ్ డీఈ భరణికుమార్, ఏఈలు చార్యులు, నాగులు, జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంపత్ వేంకటేశ్వరుడికి సుప్రభాత సేవ


ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వరుడు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకుడు శ్యామ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి పద్మావతి, ఆలివేలు మంగమ్మకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీ దళబిల్వార్చన, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భక్తి సంకీర్తన, నక్షత్ర హారతి నిర్వహించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: ట్రాన్స్‌కో లైన్స్ నిర్వహణ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్ 1 ఆపరేషన్స్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు మధుసూదన నగర్, కైలాసపురం పరిధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


వ్యక్తి మృతదేహం


సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పోర్ట్ క్వార్టర్స్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. పోర్ట్ క్వార్టర్స్ ప్రాంతంలోని సాయిరాంనగర్ కాలనీలో సుమారు 32 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉండటాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ విజయకుమార్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన కుటుంబ సభ్యులు, బంధువులు ఉంటే 94407 96012 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

విజిలెన్స్ వారోత్సవాలు


యువతకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మోహన్

సీతమ్మధార: అవినీతి నిరోధక వారోత్సవాల్లో భాగంగా శనివారం ద్వారకానగర్, దొండపర్తి రోడ్డులోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ అధికారుల సంచార వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యువతకు కె.మోహన్ సర్టిఫికెట్లు అందజేశారు.

శివాలయ పరిసరాల్లో మద్యం బాటిళ్లు


నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద మద్యం, బీర్ సీసాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో రాత్రి పూట మందుబాబులు మద్యం తాగి బాటిళ్లు అక్కడే పడేస్తున్నారు. ఈ ప్రాంతంలో స్థానికులు ఉమా నీలకంఠేశ్వర స్వామిని ఆరాధిస్తుంటారు. అటువంటి ఆధ్యాత్మిక ప్రాంతంలో మద్యం, బీరు బాటిళ్లను తాగి పడేయడంపై భక్తులు మండిపడుతున్నారు. రాత్రి పూట మందుబాబుల చిందులతో అటుగా వెళ్తున్న మహిళలు, యువతులు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గడప గడపలో సంక్షేమం.. సంతోషం


సంక్షేమ పథకాల లబ్ధి వివరిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందడంతో లబ్ధిదారులు ఆనందంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఘన స్వాగతం పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 25వ వార్డు రెల్లివీధి–1 సచివాలయం పరిధిలోని శాంతిపురం, రాజీవ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుంచి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాల ద్వారా దాదాపు ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ ఇంటికి వెళ్లినా సాదరంగా స్వాగతం పలుకుతూ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదన్నారు. జగనన్న పాలనలో ప్రజా ప్రతినిధులే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ రాయుడు శ్రీను, మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు, వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, హరికృష్ణ, మువ్వల సంతోష్, వెంకటేష్, అశోక్, అప్పన్న, గౌరి నాయుడు, కొండలరావు, సన్నీ, వీరమ్మ, రత్నం, కోటి, జయ, పద్మ, శంకర్, శ్రీను, శ్రావణ్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'కు విశేష స్పందన

- నిత్యం ప్రజల మధ్యే వైద్య సిబ్బంది
- రోజుకు సుమారు 500 మందికి పైగా వైద్య పరీక్షలు

మద్రిపాలెం: ప్రజల చెంతకే వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా అమలవుతోంది. ఆయా ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాల్లో బీపీ, సుగర్, డెంటల్, స్కిన్, నేత్ర తదితర 56 రకాల వైద్య పరీక్షలు ప్రజల ముంగిటే చేయడం విశేషం. వాటికి ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది తరలివెళ్తున్నారు. ఈ క్రమంలోనే 53వ వార్డు శివనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య సేవల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. తాళాలు వేసి వ్యక్తిగత పనులకు వారు వెళ్లడం లేదు. ఆయా సందర్భాల్లో ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో లేరంటూ కొన్ని పత్రికలు పనిగట్టుకుని దుష్ప్రచారం చేయడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఈ సిబ్బంది ఎక్కడ ఉన్నా.. ప్రజలకు వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. తాళం వేసిన ఆయా రోజుల్లో 52వ వార్డులోని నాలుగు సచివాలయాలు శివనగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోనికే వస్తాయి., అక్కడి ప్రజలకు కూడా చెంతనే ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. 53వ వార్డు మద్రిపాలెంలోని మొత్తం 11 సచివాలయాలు ఉన్నాయి. శివనగర్ ఆరోగ్య కేంద్రంలో శిబిరం పెట్టిన మొదటి రోజున నాలుగు సచివాలయాలకు సంబంధించి క్యాంపు జరిగింది. మిగతా ఏడు సచివాలయాలకు సంబంధించి రోజుకో సచివాలయం పరిధి చొప్పున ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 11 సచివాలయాలకు సంబంధించి 8 రోజులు జరిగిన ఈ క్యాంపులో 5,000 మందికి పైగా రోగులు వచ్చి వైద్య సేవలు పొందారు. రోజుకు ఇద్దరు స్పెషలిస్టు డాక్టర్లు పీడియాట్రిక్, గైనిక్, ఆర్థోపెడిక్ తదితరవైద్యులు, ఇద్దరు వైద్యాధికారులు ఈ శిబిరాల్లో ఉన్నారు. నేత్ర, దంత వైద్యులు ప్రతి నిత్యం శిబిరంలో ఉండి రోగులకు వైద్య సేవలు అందించారు.


శివనగర్ యూపీహెచ్‌సీలో నిర్వహించిన వైద్య శిబిరానికి హాజరైన జనం

ప్రజల్లోనే ఉన్నాం.. వైద్య సేవలందిస్తున్నాం



ఆరోగ్య కేంద్రానికి 4 రోజులు తాళాలు వేశామంటే దానర్థం వైద్యం చేయలేదని కాదు. 52వ వార్డులో వైద్య శిబిరం నిర్వహించాం. ఆ వార్డులో నాలుగు సచివాలయాలు శివనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోకి వస్తాయి. అక్కడ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ప్రజలకు సమాచారం అందించాం. సిబ్బంది అంతా అక్కడే ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించారు. ఈ శిబిరాల్లో రోజుకు కనీసం 500 మంది వైద్యం చేయించుకున్నారు. ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను మెచ్చి ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారు. సిబ్బంది తరలించడంతో తాళం వేశాం. మా సేవలు మాత్రం యథావిధిగా సాగాయి.

– డాక్టర్ ఏంజిలీనా, వైద్యాధికారి, శివనగర్ యూపీహెచ్‌సీ

పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవలు


మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి

మురళీనగర్: పక్కా ప్రణాళికతో వాకర్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన క్లబ్ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్కు సుందరీకరణ, క్లబ్ ఆర్థికాభివృద్ధి, సేవా, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను సభ్యులకు వివరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ కార్యదర్శి కె.ద్వారకానాథ్ మాట్లాడుతూ డిసెంబరు 23, 24 తేదీల్లో విశాఖలో జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ వార్షిక సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి జె.కూర్మారావు క్లబ్ వార్షిక నివేదికలు తెలిపారు. ప్రపంచ శాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. వాకర్స్ వాయిస్ నెలవారి పత్రికను పూర్వ అధ్యక్షుడు ఎం.భాస్కరరావు ఆవిష్కరించారు.

నూతన కార్యవర్గం ఇదే

వాకర్స్ క్లబ్ 2024 సంవత్సరానికి ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్త కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి ఎస్.బుచ్చయ్య ఈ సమావేశంలో ప్రకటించారు. అధ్యక్షుడిగా పల్లా చంద్రమౌళి, ఉపాధ్యక్షులుగా ఆదిభట్ల రామకృష్ణ, మళ్ల రామకృష్ణ, కార్యదర్శిగా ఎల్‌వీ సుధాకర్, కోశాధికారిగా జె.కూర్మారావు, జాలీ వాకర్‌గా ఎస్.ప్రకాశరావు, బోర్డు డైరెక్టర్లుగా టి.వెంకటరమణ, పి.చెల్వరాజు, వడ్డాది అప్పారావు, ఆర్.నాగేశ్వరరావు, జి.విజయలక్ష్మి ఎన్నికయ్యారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. తమను వరుసగా రెండో సారి ఎన్నుకున్నందుకు కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలతో రక్షణ


సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ ఇమ్మానుయేల్ రాజు

సీతమ్మధార: ద్వారకా క్రైం పోలీస్ స్టేషన్ పరిధి సీతమ్మధార, నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని హిల్‌వ్యూ పార్కులో శనివారం పార్కు అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై సీఐ టి.ఇమ్మానుయేల్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నిఘా కెమెరాల ఏర్పాటు ద్వారా ఇళ్లు, కార్యాలయాలకు రక్షణతో పాటు గతంలో జరిగిన దొంగతనాలను సులువుగా ఛేదించవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగదు, బంగారు ఆభరణాలును బ్యాంక్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. ఊళ్లు, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తాళాలు జాగ్రత్త పరచాలన్నారు. అపార్ట్‌మెంట్లలో రిజిస్టర్ బుక్ ఏర్పాటు చేసుకొని వచ్చి పోయే వారి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో క్రైం ఎస్‌ఐ నిహార్, స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అల్పాహారం


అయ్యప్పలకు అల్పాహారం వడ్డిస్తున్న కె.కె.రాజు, కంపా హనోకు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు పోర్టు హాస్పిటల్ జాతీయ రహదారి పక్కన గల శివశంకర రజకుల కాలనీ వినాయక ఆలయం వద్ద విశాఖ శ్రీ అయ్యప్ప అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం స్వాములకు అల్పాహార వితరణ కార్యక్రమం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకులు కార్యక్రమాన్ని ప్రారంభించి అయ్యప్ప మాలధారులకు అల్పాహారం వడ్డించారు. డిసెంబర్ 14 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వ్యర్థాల తొలగింపు


టీపీటీ కాలనీలో వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార: సీతమ్మధార రైతు బజారు, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు తొలగించారు. ఈ సమస్యపై 'సాక్షి'లో 'పేరుకుపోతున్న వ్యర్థాలు' అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు తక్షణం స్పందించారు. వారి ఆదేశాలతో పారిశుధ్య సిబ్బంది చెత్త తొలగించి, డ్రైనేజీలను శుభ్రం చేశారు. సమస్య పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రైలు ప్రమాద బాధితులకు నిరంతర సేవలు


రైల్వే హాస్పిటల్‌లో తేజేశ్వరరావుకు సపర్యలు చేస్తున్న సివిల్ డిఫెన్స్ సభ్యులు

తాటిచెట్లపాలెం: కంటకాపల్లి–అలమండ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో గాయపడి, విజయనగరం, విశాఖలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు వాల్తేర్ డివిజన్ సివిల్ డిఫెన్స్ సభ్యులు నిరంతరం సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ బృంద సభ్యులు హాస్పిటల్ వైద్యుల సూచనల మేరకు బాధితులకు ఎప్పటికప్పుడు సపర్యలు చేస్తూ.. మందులు, ఆహారం తీసుకోవడంలో సహకరిస్తున్నారు. వీరి సేవలపై బాధిత కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు


కూచిపూడి నృత్యం చేస్తున్న విద్యార్థులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్ల సన్నిధి సేవ చేసి, సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, శ్రీహరి కోలాటం బృందం వారి కోలాటం ఆకట్టుకున్నాయి. ఆలయం కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఓటర్ల జాబితా పరిశీలన


ఓటర్ లిస్టుల విషయమై బీఎల్‌వోలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం జాతీయ రహదారి వద్ద గల భారతీయ విద్యా భవన్ పోలింగ్ కేంద్రాన్ని శనివారం జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు సందర్శించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోల వద్ద గల ఓటర్ లిస్టులను పరిశీలించారు. ఓటు నమోదు, సభ్యుల ఓట్లు ఉన్నాయో లేదో పరిశీలించి, అవసరమైన వారికి మార్పులు చేర్పులను చేపట్టాలని ఆయన సూచించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. భారతీయ విద్యా భవన్ పోలింగ్ కేంద్రం వద్ద శని, ఆదివారాల్లో బీఎల్‌వోలు ఓటరు లిస్టులతో ఉంటారని చెప్పారు. 45వ వార్డు కొండవాలు ప్రాంతాలకు చెందిన ప్రజలంతా ఈ జాబితాల్లో తమ పేర్లు తనిఖీ చేసుకోవాలని కంపా హనోకు కోరారు. కార్యక్రమంలో బీఎల్‌వోలు జి.నాగేశ్వరరావు, జి.దేవేందర్, ఇ.వినయ్‌కుమార్, రేష్మ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడ పైడి రమణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టీంకు ఏయూ విద్యార్థినుల ఎంపిక


ఎంపికైన పరిమళ, గాయత్రి

ఏయూక్యాంపస్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర అండర్–15 మహిళా క్రికెట్ జట్టుకు ఏయూ ఆంగ్ల మాధ్యమం విద్యార్థినులు పి.వి.ఎల్.ఎస్.పరిమళ, పి.జె.గాయత్రి ఎంపికయ్యారు. వీరిద్దరూ ఏయూ ఆంగ్ల మాధ్యమం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను శనివారం పాఠశాల కరస్పాండెంట్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ సుధారాణి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

రిమాండ్ ఖైదీ మృతిపై 10న విచారణ

మహారాణిపేట: రిమాండ్ ఖైదీ బట్టు వీరబ్రహ్మం మృతిపై ఈ నెల 10న మెజిస్టీరియల్ విచారణ చేపడుతున్నట్లు విశాఖ ఆర్డీవో డి.హుస్సేన్ సాహెబ్ ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి నగలమ్మ వీధికి చెందిన బట్టు వీరబ్రహ్మం(78)ను చికిత్స నిమిత్తం 2023 మే 15న కేజీహెచ్‌కు తీసుకొచ్చారు. అదే రోజు చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు. దీనిని లాకప్ డెత్‌గా పరిగణించి మెజిస్టీరియల్ విచారణ చేపట్టాలని నిర్ణయించి.. విశాఖ ఆర్డీవోను విచారణాధికారిగా నియమించారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలోని తన కార్యాలయంలో ఆ రోజు 11 గంటలకు విచారణ ప్రారంభమవుతుందని, వీరబ్రహ్మం మరణం గురించి తెలిసిన వారు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని ఆర్డీవో సూచించారు.

అప్పన్నకు విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

డీఆర్‌డీవో టీటీ పోటీల విజేత ఏఎస్‌ఎల్

విశాఖ స్పోర్ట్స్: డీఆర్‌డీవో సెంట్రల్ జోన్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో హైదరాబాద్‌కు చెందిన ఏఎస్‌ఎల్ విజేతగా నిలవగా ఆర్‌సీఎల్ రన్నరప్‌గా నిలిచింది. ఇక్కడి సాగరసమరతీర సాంకేతిక సంస్థ ఆధ్వర్యంలో ముగిసిన ఈ టీమ్ చాంపియన్‌షిప్‌లో తొమ్మిది మంది మహిళా క్రీడాకారిణులతో మొత్తంగా 102 మంది తొమ్మిది బృందాలుగా డీఆర్‌డీవో ల్యాబ్ జట్లు పోటీపడ్డాయి. నాలుగు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో ఎన్‌ఎస్‌టీఎల్, అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లాబొరెటరీ(ఎఎస్‌ఎల్), సెంటర్‌ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ సైన్సెస్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ లేబొరేటరీ(చెస్), రీసెర్చ్‌సెంటర్ ఇమారత్(ఆర్‌సిఐ), డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీ(డీఆర్‌డీఎల్)తో సహా వివిధ డీఆర్‌డీవో ల్యాబ్‌లకే చెందిన వీరంతా పోటీపడ్డారు.